# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 286
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఆగస్టు 21, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ప్రదీప్ రావు ప్యానల్ ఘనవిజయం


పోటాపోటీగా అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు



8లో..

## ప్రెస్ క్లబ్‌కే నా సీడీఎఫ్ నిధులు

- శాసనమండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాశ్
- హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు



2లో..

## వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్

- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు వినతి



8లో..

## గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- మడికొండ గురుకులంలో ఆకస్మిక తనిఖీ



వివరాలు2లో..

# అభివృద్ధి, సంక్షేమమే.. ధ్యేయం

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



- రూ. 5.87 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న కలెక్టర్, మేయర్, కమిషనర్
- రూ. 1కోటి వ్యయంతో మాషుఖ్ రబ్బానీ దర్గా అభివృద్ధి
- రూ.1.42 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం
- నిరుపేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గత పది సంవత్సరాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఇప్పుడు అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తున్నామన్నారు. తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ. 5.87 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు గురువారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో 15వ ఆర్థిక సంఘ, జనరల్ ఫండ్, ఎస్ఎఫ్ సీ పథకం నిధులు రూ. 4.87 కోట్లు కాగా, ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో మరో కోటి రూపాయలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. 15వ ఆర్థిక సంఘ, జనరల్ ఫండ్ నిధులు, ఎస్ఎఫ్ సీ పథకం నిధులతో బల్దియా పరిధిలోని 32 వ డివిజన్ బీఆర్ నగర్ లో బస్తి దవాఖాన, ఎన్ఎన్ నగర్, జ్యోతినగర్ లో సీసీ రోడ్లు, అంబేద్కర్ భవన్ కమ్యూనిటీ హాల్, బీరన్నకుంట కమ్యూనిటీ హాల్, 28వ డివిజన్ బట్టలబజార్ శ్రీ బాలా వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కిచెన్ షెడ్ నిర్మాణం, 42 డివిజన్ రంగశాయిపేటలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులకు మంత్రి సురేఖ శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో మాషుఖ్ రబ్బానీ దర్గాలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కరీమాబాద్ పరపతి సంఘ భవనంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను మంత్రి కొండా సురేఖ, కలెక్టర్, కమిషనర్, మేయర్ చేతుల మీదుగా అందజేశారు. - వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- రూ. 5.87 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న కలెక్టర్, మేయర్, కమిషనర్
- రూ. 1కోటి వ్యయంతో మాషుఖ్ రబ్బానీ దర్గా అభివృద్ధి
- రూ.1.42 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం
- నిరుపేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. రూ. 5.87 కోట్లతో తూర్పు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయిలతో కలిసి మంత్రి సురేఖ మధ్యాహ్న భోజనం వడ్డించారు. అనంతరం కరీమాబాద్ లోని ఫంక్షన్ హాల్, రంగశాయిపేట కమ్యూనిటీ హాల్ లో జరిగిన సభలో మంత్రి ప్రసంగించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే సంకల్పంతోనే ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టిందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం తెలంగాణ ప్రజలు గత పది సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల సమస్యల మీద దృష్టి సారిస్తున్నారన్నారు. అందుకే ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రేషన్ ద్వారా దొడ్డు బియ్యం ఇచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. రేషన్ కార్డు మంజూరైన వారికి వెంటనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

### విద్యార్థులకు పౌష్టికాహారం..

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు మంత్రి సురేఖ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 40 శాతం మెస్ చార్జీలతోపాటు 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచామన్నారు. విద్యార్థులకు పూర్తి నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రామకృష్ణ మిషన్ అక్షయపాత్ర వారి ద్వారా జిల్లాలోని 123 ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి విడతలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈరోజు కరీమాబాద్ లోని బీరన్నకుంటతో పాటు మరో 55 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం జరిగిందన్నారు. దశలవారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దీనిని అమలు చేస్తామన్నారు. వరంగల్ మహా నగరాన్ని హైదరాబాద్ మాదిరిగా సమగ్ర అభివృద్ధి చేసేందుకు మామునూరు విమానాశ్రయం, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఏర్పాటుకు ముందుకెళ్తున్నామని మంత్రి తెలిపారు.

### ముంపు నివారణకు చర్యలు..

వరంగల్ నగరాన్ని ముంపు నుంచి రక్షించేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని మంత్రి కోరారు. దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న తాను ప్రణాళిక బద్ధంగా జిల్లాలోని అన్ని దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి పేదవారి కష్టాలను తెలుసుకొని వారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించారని, నేడు సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో పేదవారి ఇంటి కల సాకారం అవుతోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించగా అర్హులైన అత్యంత పేదవారికి మంజూరు పత్రాలు జారీ చేశామన్నారు. దీంతో వారు ఇప్పటికే ముగ్గు పోసి ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ సంవత్సరం కూడా మరో 3500 ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలకు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు పల్లం పద్మ-రవి, సోశాల పద్మ-స్వామి, చింతాకుల అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసాల ప్రకాశ్, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# సమాజానికి మార్గ నిర్దేశకులు సీనియర్ సిటిజన్స్

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నడుస్తున్న సమాజానికి సీనియర్ సిటిజన్స్ మార్గదర్శకులని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీబీ నిర్మలా గీతాంబ అన్నారు. గురువారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్ అధ్యక్షతన న్యాయ సేవా సదన్ బిల్డింగ్ లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ 'తల్లిదండ్రులను దైవసమానులుగా భావించినప్పుడే మనిషి విలువకు అర్థం' అన్నారు. చట్టపరమైన వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సీనియర్ సిటీజన్స్ సమాజంలో గౌరవప్రదమైన జీవనం గడపడానికి ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు ఆచరణరూపం దాల్చడానికి డీఎల్ఎస్ఏ కృషి చేస్తుందని అన్నారు. ప్రతి కుటుంబంలో వయోవృద్ధులు ఉంటారని, వారు ఇబ్బందులు పడకుండా కుటుంబ సభ్యులు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడం మన ధర్మం, వారికి బ్రతుకు భరోసా కల్పించడం మన ధ్యేయం, వారిని ఆదరించడం మన కర్తవ్యం, వారి పట్ల ప్రేమ చూపడం మనిషి తరం యొక్క నిజమైన నిర్వచనం అని తెలిపారు. సీనియర్ న్యాయవాది తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ వృద్ధుల పాత్ర ఎంతో విలువైనదిగా తెలిపారు. వృద్ధులు అంటే వయసు పెరిగిన వారు కాదు, జీవన అనుభవాల ఖజానా, జ్ఞాన సంపదగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, న్యాయవాదులు, ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్

- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు వినతి



**వరంగల్ వాయిస్, న్యూ ఢిల్లీ :** వరంగల్‌లో ఇప్పటికే ఆమోదం పొందిన సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ను త్వరితగతిన ప్రారంభించాలంటూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. కొత్త ఢిల్లీలో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కడియం కావ్య ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ సీజీహెచ్ఎస్ సౌకర్యం లేకపోవడంతో వారు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వరంగల్‌లో సీజీహెచ్ఎస్ సెంటర్‌కు ఆమోదం తెలిపిందని, కానీ ఇంకా పనులు ప్రారంభం కానందున ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోతున్నారన్నారు. వెంటనే వరంగల్ సీజీహెచ్ఎస్ లో వైద్య సిబ్బంది నియామకం చేపట్టి, శాశ్వత భవనం కేటాయించి సెంటర్‌ను ప్రారంభించాలని ఎంపీ కేంద్ర మంత్రి నడ్డాను కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడించారు.

### యువతకు వ్యాపార అవకాశాలు కల్పించాలి..

వరంగల్ లోని గ్రామీణ యువత, ముఖ్యంగా ఎస్సీ యువత కోసం వ్యాపార అవకాశాలు కల్పించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో ప్రశ్నించారు. ప్రధాని ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న వ్యాపారాలు పెరుగుతున్నాయని, ఇందులో ఎస్సీ యువతకు ఎక్కువ సబ్సిడీలు కల్పించడం ద్వారా వారికి వ్యాపారం చేయడం సులభమవుతుందన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి సారంగపాణి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రఖ్యాత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, కీర్తిశేషులు డాక్టర్ పరికిపండ్ల సారంగపాణిని బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సమాజానికి విశేష సేవలు అందించిన మహానుభావుడిగా కొనియాడారు. హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీలో డాక్టర్ సారంగపాణి మొదటి వర్ధంతి సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ, డాక్టర్ సారంగపాణి ఆరు పీ.జీలు, రెండు పీహెచ్డీలు చేసి, న్యాయశాస్త్రంలో పట్టా పొందారని తెలిపారు. అంతేకాకుండా, ఆయన వివిధ అంశాలపై 18 పుస్తకాలు రచించారని, ఇది ఆయన అసాధారణ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా సైకాలజిస్ట్‌గా నిరంతరంగా ఉచిత కౌన్సిలింగ్ సేవలు అందిస్తూ వేలాది కుటుంబాలకు సహాయం చేశారని, లక్షలాది మంది యువత, విద్యార్థులకు ప్రేరణ కలిగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సారంగపాణి రచించిన రెండు పుస్తకాలు –'జీవిత సత్యాలు', 'మహనీయుల సత్యవాక్కులు, మీకోసం' ఆవిష్కరించబడ్డాయి. 'జీవిత సత్యాలు' పుస్తకం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పరంజ్యోతి' శీర్షికన మూడు సంవత్సరాల పాటు ప్రచురించబడిన ఆధ్యాత్మిక వ్యాసాల సంకలనం. ఈ కార్యక్రమంలో తాళ్ల విజయ్, మండల శేఖరయ్య, తుమ్మ సాంబయ్య, బొల్లు రాజేష్, పరికిపండ్ల భరత్, గాజుల సంపత్, కవిత, సౌభాగ్య, సుజాత, సువర్ణ, సారంగపాణి కుటుంబ సభ్యులు సుదర్శన్, సురేష్, వేణు, దామోదర్, ఏకాంతం, నవీన్, హరినాథ్, సంపత్, శ్రీధర్, యశ్వంత్ తో పాటు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు, అభిమానులు మరియు బంధువులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన ప్రముఖులు సారంగపాణి సేవలను స్మరించుకొని ఆయనకు నివాళులర్పించారు.

# కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



**వరంగల్ వాయిస్, దామెర :** వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) పసరుగొండ క్లస్టర్ ఆధ్వర్యంలో పులుకుర్తి గ్రామంలోని వరి పొలాలను సందర్శించి రైతులకు కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వరి నాట్లు వేస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెరుక రాజు, అంకెశ్వరపు నర్సింగం, ఏఈఓ పాల్గొన్నారు. వరి నాట్లు వేసిన 3 నుంచి 5 రోజుల మధ్య కలుపు మందులను పిచికారీ చేయాలి. ఒక ఎకరానికి 35 గ్రాముల ఆక్సాడైయార్జిల్ లేదా 400 మి.లీ. ప్రెటిలాక్లోర్ లేదా 100 గ్రాముల పైరజో సల్ఫ్యూరాన్ మందును 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో పలుచగా నీరు పెట్టి చల్లాలి. మందు చల్లిన తర్వాత పొలంలోని నీటిని తీసివేయకుండా జాగ్రత్త పడాలి. కలుపు సమస్య అధికంగా ఉంటే, విత్తిన 20 రోజుల తర్వాత 80 నుంచి 120 మి.లీ.ల బిస్ పైరిబాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి కలుపు మొక్కల మీద పిచికారీ చేయాలి. ఊద ఎక్కువగా ఉంటే: 300–400 మి.లీ.ల సైహలోఫాప్ బ్యుటైల్ మరియు 1.02% పెనోకుస్ సులమ్ మందును వాడాలి. 400 గ్రాముల 2,4డి సోడియం లవణాన్ని ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మందు పిచికారీ చేసే ముందు పొలంలోని నీటిని తీసివేయాలి. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తినప్పుడు, విత్తిన 20–25 రోజులకు కోనోవీడర్‌ను ఉపయోగించి కలుపును తొలగించాలి. కోనోవీడర్‌ను నడపడం వలన వరుసల్లో ఉన్న కలుపు నేలలో కలిసిపోతుంది. ఆ తర్వాత ప్రతి 10 రోజులకు ఒకసారి, కలుపు ఉన్నా లేకపోయినా కోనోవీడర్ నడపడం వలన నేల కదులుతుంది. దీనివల్ల వేర్లకు గాలి, పోషకాలు అంది వేరు వ్యవస్థ బలంగా మారి, మొక్క గుబురుగా పెరిగి దిగుబడి పెరుగుతుంది. కోనోవీడర్ ఉపయోగించే ముందు రోజు సాయంత్రం పొలంలో పలుచగా నీరు పెట్టాలి. పంట పెరిగే దశలో కలుపు మొక్కలను కూలీల చేత తీయించాలన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కందికట్ల ఉప్పలయ్య ఇటీవల వాగులో కొట్టుకుపోయి అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే. గేదెలను కాసుకుంటూ జీవనం సాగించే ఉప్పలయ్య మృతితో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో, నారాయణపురం గ్రామానికి చెందిన అంబేద్కర్ సేవా సమితి సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఉప్పలయ్య మరణం ఊహించనిదని, ఆ కుటుంబానికి తీరని లోటు అని సేవా సమితి సభ్యులు అన్నారు. ఆయన గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో ఉప్పలయ్య కుటుంబానికి 100 కిలోల బియ్యాన్ని అందజేశారు. దుఃఖంలో ఉన్న వారికి ఆ దేవుడు ధైర్యాన్ని, మనశ్శాంతిని ప్రసాదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు కందికట్ల వెంకన్న, కందికట్ల భిక్షపతి, సేవా సమితి అధ్యక్షులు కందికట్ల సునీల్ కుమార్, కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఉపాధ్యక్షులు కందికట్ల రాజు, కందికట్ల ప్రవీణ్ కుమార్, గోగుల బాబు, కందికట్ల భాస్కర్, సింగారపు రమేష్, కందికట్ల రాంబాబు, సింగారపు వెంకన్న, ముత్యాల రాజు, హరీష్, స్వామిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం వనదేవతలకు ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** హనుమకొండ జిల్లాలోని శాయంపేట మండలం నర్సింహులపల్లె గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నర్సింహులపల్లె గ్రామ ప్రజలకు అష్టైశ్వర్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. అనంతరం, చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చౌళ్ల లక్ష్మణ్ రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ ప్రెసిడెంట్ పెంతల నరేందర్, ప్రధాన కార్యదర్శి యార వీరయ్య, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, శ్రీకాంత్, కృష్ణ, రాజు, రాజేందర్, కాజా పాషా, అశోక్, సురేందర్, రమేష్, నాగరాజు, అరవింద్, చంద్రమౌళి, రవి, రాజయ్య, సుమన్, రత్నాకర్, కర్ణాకర్, మల్లారెడ్డి, శీను, సురేందర్ వంటి పలువురు పాల్గొన్నారు.

# రక్తదానం.. మహాదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక సాయిబాబా మందిరంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో 42 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ పొన్నాల సంయుక్త తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు పెసరు విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెసరు విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఒకరి ప్రాణాలను కాపాడి వారికి పునర్జన్మను ఇస్తుందని అన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్న దాతలను అభినందించారు. సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, లైన్ చంద్రశేఖర్ ఆర్య రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు ప్రకాష్ మార్గం ప్రభాకర్, రాజేశ్వరి, ఉష, నరసింహారెడ్డి, నిర్మల, మందిర ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యి గండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పొన్నాల సంయుక్త, రామ్మోహన్ దంపతులు కలిసి 42 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్ క్రాస్ సొసైటీకి అందించారు. ఈ రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి అందరూ సహకరించారు.

# వృద్ధులకు సన్మానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని పిన్నవారి వీధిలో నివాసం ఉంటున్న భవలాల్ జోషి (82) గత 60 ఏళ్ల నుంచి వివిధ మిఠాయిలవ్యాపారం చేస్తూ జీవనోపాధి గడుపుతూ ఎంతోమందికి జీవనోపాధి కల్పిస్తున్నారు. ఈ వయసులో కూడా ఇంకా పని చేస్తూ జీవనం సాగిస్తున్న సందర్భంగా ట్రస్ట్ ఆయన్ని ఘనంగా శాలువా, పూల బొకేతో సన్మానించింది. వీరిని స్ఫూర్తిగా తీసుకొని వృద్ధులు అనే భావన మనసులో కలగకుండా తమ పని తాము చేసుకుంటూ ఇతరులకు మార్గదర్శకులు కావాలని మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, మిట్టపల్లి సమ్మయ్య, శ్రవణ్, లక్ష్మయ్య, శ్రీకాంత్, శంకర్ పాల్గొన్నారు.

# శాలివాహన సంఘం మండల కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల శాలివాహన (కుమ్మరి) సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మండలంలోని 15 గ్రామాల శాలివాహన కులస్తులు సమావేశమై కమిటీని ఏర్పాటు చేశారు. కొత్త కమిటీ అధ్యక్షుడిగా పిడిశెట్టి దేవేందర్, ప్రధాన కార్యదర్శి కునారపు రఘు, ఉపాధ్యక్షుడు తరిగొప్పుల తిరుపతి, కోశాధికారిగా ఆశాడపు దశరథం, సహాయ కార్యదర్శి ఎర్రారపు శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి పెద్దపల్లి తిరుపతి, గౌరవ అధ్యక్షులు ఆశాడపు రాజవీరు, గౌరవ సలహాదారులుగా ఆశాడపు నటరాజ్ ఎన్నికైనట్లు మండల ఇంఛార్జిలు ఆకారపు శంకర్, చిలువేరు సుధీర్ వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# నీట మునిగిన పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించాలి

## బీజేపీ మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** అధిక వర్షాలతో గణపురం మండలంలో మోరంచవాగు ఉప్పొంగడంతో వాగు పరిసర ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను జిల్లా అధికార యంత్రాంగం పరిశీలించి తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షులు ఊర నవీన్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతు జిల్లాలో మరి కొద్ది రోజులు అధిక వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఇప్పటికే మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని సీతారాంపూర్ ధర్మరావుపేట, గణపురం, చెల్పూర్ శివారులో వరద తాకిడికి గుర్రై పంట పొలాలు నీట మునిగాయన్నారు. గత రెండు రోజులుగా వరి పంట నీటిలో మునిగి ఉండటం, పొలాల్లో ఇసుకమేటలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి సర్వే చేపట్టి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అదే వి ధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫలస్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆ పథకాన్ని అమలు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇటీవల అనారోగ్యంతో మరణించిన బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి తండ్రి కొండి మాధవ రెడ్డికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్, పరకాల నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతి రెడ్డి తదితర నాయకులు జితేందర్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ జక్కు రమేష్, దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు, మండల ఉపాధ్యక్షురాలు పాలకుర్తి శ్రీలత, బూత్ అధ్యక్షులు చుక్క మహేందర్, పెరుగు స్పందన, నాయకులు పాలకుర్తి శ్రీనివాస్, సంగనవేన వేణు పాల్గొన్నారు.

# కవ్వంపల్లి రాజేశంకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం మంగళవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి, రాజేశం పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, శాయంపేట సర్పంచ్ ఆకినపల్లి సుజాత భద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ సందాని తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించకుంటే ధర్నా చేస్తాం


## ◆ కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** తమ డివిజన్‌లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించకుంటే సెప్టెంబర్ 1న సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తామని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హెచ్చరించారు. గురువారం రోజున ఉర్సు ప్రతాప్ నగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పూజారి విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ రంగశాయిపేట సబ్‌స్టేషన్ పరిధిలో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలు, వంగిన స్తంభాలు. వేలాడుతున్న విద్యుత్ తీగలు. వర్షం కురిసినప్పుడు విద్యుత్ స్తంభాల నుంచి షాక్‌లు రావడం. కొన్ని స్తంభాల వద్ద మంటలు చెలరేగడం. లో–వోల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం. తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల విద్యార్థులు, కుటీర పరిశ్రమలపై ఆధారపడినవారు నష్టపోవడం. ఈ సమస్యల గురించి అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదని రవి అన్నారు. నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో అధికారులు చొరవ చూపడం లేదని ఆయన ఆరోపించారు. సెప్టెంబర్ 1వ తేదీలోపు ఈ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పూజారి విజయ్, వనం కుమార్, నాయకులు మరుపల్ల గౌతమ్, శెట్టి మోహన్, సాదుల రంజిత్, పోలేపాక రాజన్ బాబు, గజ్జి సాంబయ్య, పోలేపాక మల్లేశం, తౌటం నరసింహ, కళ్యాణపు వెంకటేశ్వర్లు, అన్న శ్రీనివాస్, గోనె మధు, చీర రమేష్, చింతపట్ల ప్రశాంత్, కోరే సాంబమూర్తి, మంద బాబు పాల్గొన్నారు.

# పూర్వ జిల్లా అభివృద్ధిపై సమీక్ష

## పాల్గొన్న వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** పూర్వ కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమీక్షా సమావేశానికి హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఇంఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ జిల్లా అభివృద్ధి నిధుల కేటాయింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు.

### ఎమ్మెల్యే కవ్వంపల్లికి ప్రణవ్ పరామర్శ..

కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాజేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాడికి జైలు శిక్ష, జరిమానా



**వరంగల్ వాయిస్, క్రైమ్:** సైబర్ నేరాలకు పాల్పడిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిదూర్ మహతో (35) కు వరంగల్ కోర్టు ఒక సంవత్సరం 29 రోజుల జైలు శిక్ష, రూ. 5,000 జరిమానా విధించింది. వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన ఇతను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కాకతీయ విశ్వవిద్యాలయం పోలీస్ స్టేషన్‌లో 2, సుబేదారి పోలీస్ స్టేషన్‌లో 2, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో 1 కేసు నమోదయ్యాయి. బిదూర్ మహతో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు అధికారిగా జూపాక అర్చన అనే వ్యక్తికి ఫోన్ చేసి, రూ. 63,837/– మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేయూసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీటీ వారెంట్‌పై నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, విచారణ అధికారి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీని ఆధారంగా 20–08–2025న హనుమకొండలోని మూడవ అదనపు జేఎఫ్‌సీఎం కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్ బీ) ప్రజలకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏదైనా సైబర్ నేరం జరిగితే, వెంటనే 1930 నంబర్‌కు లేదా cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. తక్షణ ఫిర్యాదు ద్వారా నిందితులకు శిక్షలు విధించడమే కాకుండా, పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్ కల్కోటా తెలిపారు.

# ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

## ◆ కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ధర్నా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఫేస్ క్యాప్చర్ (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని రద్దు చేయాలని, ఒకే ఆన్‌లైన్ యాప్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించిన అంగన్‌వాడీలు గంటపాటు ధర్నా చేశారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి మాట్లాడుతూ పలు కీలక డిమాండ్లను లేవనెత్తారు. ఆరేళ్ల లోపు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ వయసులో 70శాతం శారీరక, 90శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని, దీనికోసమే ఐసీడీఎస్ వ్యవస్థ ఏర్పడిందని పేర్కొన్నారు. పిల్లల జీర్ణశక్తిని బట్టి పోషకాహారం అందించడంలో ఐసీడీఎస్ కీలకమని చెప్పారు. పౌష్టికాహారాన్ని నిర్లక్ష్యం చేస్తే పిల్లల్లో ఎదుగుదల లోపించి, ఇంగ్లీష్ మీడియం విద్యను కూడా నేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రభుత్వ విద్యను బలపరచకపోగా, ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన జాతీయ విద్యా విధానం (2020) ఐసీడీఎస్ మరియు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ విధానం ప్రభుత్వ విద్య స్థానంలో కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తుందని, మూఢనమ్మకాలను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రమాదకరమైన చట్టాన్ని తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు నిడిగొండ రజిత, పి.రమాదేవి, శోభారాణి, కె.జమున, జోత్స్న, ప్రసన్న, రాజేశ్వరి, హైమావతి, వసంత, కిరీట, సీహెచ్. స్వరూపారాణి, ఎస్. ఉమాదేవి, బేబీ రాణి, శోభ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠాపన

### ◆ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నగరంలోని రెడ్డీపురం భగత్ సింగ్ నగర్‌లో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల దేవాలయంలో గురువారం నూతన నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ పూజారులు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిష్ఠాపన గావించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రభాకర్, ప్రధాన అర్చకులు రమేష్, సిద్ధోజు రాకేష్, రాజు, పోతుగంటి రమేష్, లక్ష్మీనారాయణతో పాటు కాలనీ వాసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# టీజీ ఐసెట్ 2025 కౌన్సిలింగ్ ప్రారంభం




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, టీజీ ఐసెట్–2025 కౌన్సిలింగ్ ప్రక్రియ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల కోసం ప్రారంభమైంది. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ మొదలైంది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఈ కౌన్సిలింగ్ పకడ్బందీగా జరుగుతోంది. ఫేజ్–1 షెడ్యూల్ లో ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్ 20 నుంచి 28 వరకు ఉంటుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ 22 నుంచి 29 వరకు (27-08-2025 మినహా) జరుగుతుంది. ఆప్షన్ ఎంట్రీ 25 నుంచి 30 వరకు ఉంటుంది. ఆప్షన్ ఫ్రీజింగ్ 30న. సీట్ల ప్రొవిజనల్ అలాట్‌మెంట్ సెప్టెంబర్ 02 లోపు. ట్యూషన్ ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ సెప్టెంబర్ 02 నుంచి 05 వరకు. ఫైనల్ ఫేజ్ షెడ్యూల్ ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్ సెప్టెంబర్ 08న. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సెప్టెంబర్ 09న. ఆప్షన్ ఎంట్రీ సెప్టెంబర్ 09 నుంచి 10 వరకు. ఆప్షన్ ఫ్రీజింగ్ సెప్టెంబర్10. సీట్ల ప్రొవిజనల్ అలాట్‌మెంట్ సెప్టెంబర్ 13 లోపు. ట్యూషన్ ఫీజు చెల్లింపు & సెల్ఫ్ రిపోర్టింగ్ సెప్టెంబర్ 13 నుంచి 15 వరకు. అలాట్ అయిన కళాశాలలో రిపోర్టింగ్ సెప్టెంబర్ 15 నుంచి 16 వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్ (ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలలకు) స్పాట్ అడ్మిషన్స్ మార్గదర్శకాలు సెప్టెంబర్ 15 నుంచి టీజీ ఐసెట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, క్యాంప్ ఆఫీసర్ డా. బైరి ప్రభాకర్, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్. రవీందర్ లు మాట్లాడుతూ కౌన్సిలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం సరైన ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించారు. నేటి డిజిటల్, కార్పొరేట్ ప్రపంచంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు విస్తృత అవకాశాలను కల్పిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి కెరీర్ సాధించవచ్చని తెలిపారు.

# గుంతల మయంగా రహదారి

### మరమ్మతు చేయాలని సీపీఎం డిమాండ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** సంవత్సరాల తరబడి గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఎం రఘునాథపల్లి మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ డిమాండ్ చేశారు. అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. గురువారం రోజున సీపీఎం రఘునాథపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో అంగడి బజారులో నిర్వహించిన పర్యటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహేందర్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిగూడెం, శ్రీమన్నారాయణపురం, బానాజీపేట, కంచనపల్లి, గబ్బెట, కన్నాయపల్లి, కోడూరు, శివాజీ నగర్, మల్లంపల్లి వంటి సుమారు 10 గ్రామాలను కలిపే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందని అన్నారు. భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ఈ రోడ్డుపై అనేక సందర్భాలలో వాహనాలు బోల్తా పడ్డాయని తెలిపారు. అలాగే, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు అదుపుతప్పి కింద పడి గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు అనేకం జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమవడంతో గుంతల్లో వర్షపు నీరు చేరి, వాటి లోతు తెలియక మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని మహేందర్ చెప్పారు. ప్రతి గురువారం ఇక్కడ జరిగే అంగడికి ప్రజలు రాకపోకలు సాగించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# ముగిసిన ఉల్లాస్ మండల స్థాయి శిక్షణ

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సీసీ), విలేజ్ ఆర్గనైజ్ అసిస్టెంట్ల (వీఓఏ) కు మండల స్థాయి శిక్షణ పూర్తి అయ్యింది. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి, ఐకేపీ ఏపీఎం ఆదరసంది రాజీర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం కల్పించడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, క్లస్టర్, గ్రామ స్థాయిలో పనిచేసే సీసీ, వీఓఏల పాత్ర కీలకమని అన్నారు. 8వ తరగతి ఆపైన చదువుతున్న విద్యార్థులు, పట్టభద్రులు, విశ్రాంత ఉద్యోగులు వంటి విద్యావంతులు స్వచ్ఛంద బోధకులుగా ఈ కేంద్రాలలో సేవలందిస్తారని తెలిపారు. వడ్లకొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు టి. శ్రీధర్ గౌడ్, దౌలత్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి. కుమారస్వామి రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించి శిక్షణ అందించారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన వీరంతా



గ్రామాలకు తిరిగి వెళ్లి బోధకుల సహాయంతో నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, అంకెలను గుర్తించడం వంటి ప్రాథమిక సామర్థ్యాలను బోధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శేషు, డీపీఎం ఫామ్ వరలక్ష్మి, ఏపీఎం ఫామ్ సారయ్య, కొంకపాక కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఏ. భిక్షపతి, పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ పి. రమేష్ బాబు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సీసీలు, వీఓఏలు, ఎంఆర్పీ సీఆర్పీలు ప్రవీణ్, రజిత, సుధ, లోకేష్, సంధ్య, సీసీఓ జయరాజ్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం చొరవతో మైనార్టీ మండల నాయకులు ఎండీ సైదులు, పాషా నాయకత్వంలో 25 కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, మైనార్టీ నాయకులు ఎండీ మౌలా, ఎండీ బహదూర్ పాల్గొన్నారు.

# విశ్వ భారతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా శివ వుల్కందకార్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** విశ్వ భారతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా శివ వుల్కందకార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ వ్యవస్థాపకురాలు ఎస్.రమాదేవి సమక్షంలో, జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకుల సమక్షంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.రమాదేవి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల సమస్యల పరిష్కారానికి కార్మికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, నిరుద్యోగుల పక్షాన శాంతియుత పోరాటాలు చేయాలని శివ వుల్కందకార్‌కు సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సేవ చేయడానికి ఎప్పుడు, ఎలాంటి అవకాశం వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. తెలంగాణ అధ్యక్షుడిగా నియమితులైన శివ వుల్కందకార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు పార్టీని హక్కున చేర్చుకునే విధంగా కార్యక్రమాలు చేపడతామని, పాలకుల దోపిడీ, దౌర్జన్యాలు, అక్రమాలు, అరాచకాలపై పోరాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ అవకాశం ఇచ్చిన పార్టీ వ్యవస్థాపకురాలు ఎస్. రమాదేవి, జాతీయ, రాష్ట్ర నాయకులకు, పార్టీ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్‌ఈజెడ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెతుకు ఉప్పలయ్య ఆయనకు అభినందనలు తెలియజేశారు.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

### కాంగ్రెస్ నేత అంబాల రాజు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** తెలంగాణ రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా బీజేపీ పార్లమెంట్ సభ్యులు పూర్తిగా విఫలమయ్యారని జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు అన్నారు. తెలంగాణకు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా మంజూరుకు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు అవుతున్నప్పటికీ, తెలంగాణకు కేటాయించాల్సిన 90 వేల మెట్రిక్ టన్నుల యూరియాలో కేవలం 40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి, మిగతా 50 వేల మెట్రిక్ టన్నులను ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంబాల రాజు ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ–ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. భవిష్యత్తులోనూ ఎరువుల సరఫరా లేదా నిధుల విషయంలో వివక్ష కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అంబాల రాజు హెచ్చరించారు.

# కంఠాత్మకూర్ ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి సిద్ధం



**వరంగల్ వాయిస్, నడికూడ:** నూతనంగా నిర్మించిన కంఠాత్మకూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ అప్పయ్య సందర్శించి, ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, గ్రామ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. రేపు కంఠాత్మకూర్ గ్రామంలో ఇంటింటికి సిబ్బందిని పంపి యుద్ధప్రాతిపదికన జ్వర సర్వే నిర్వహించి, చికిత్స అందించాలి. ప్రజలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలి. 'డ్రై డే, ఫ్రైడే' కార్యక్రమం నిర్వహించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రజలు తమ ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వాడే నీటిని నిల్వ చేసే సంపులు, తొట్టెలను వారానికి ఒకసారి శుభ్రం చేసి మళ్లీ నింపాలని సూచించారు. ముఖ్యంగా పగలు, రాత్రి దోమతెరలు వాడాలని, పగలు కుట్టే దోమల వల్ల డెంగీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం, అసంక్రమిత వ్యాధులైన హై బీపీ, డయాబెటిస్ ఉన్నవారికి మందులు సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించారు. అదేవిధంగా, క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించి, అర్హులకు సత్వరమే చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపకేంద్రం కాంట్రాక్టర్ దేవేందర్ రెడ్డి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రాజకుమార్, ఏఎన్ఎం కరుణ, హెల్త్ అసిస్టెంట్ రవీందర్, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో ప్రణవ్ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:** హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రణవ్ నేరుగా రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న చికిత్స, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండి రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి తనిఖీ సమయంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణవ్ వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

**వరంగల్ వాయిస్, క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 17 మందిని గురువారం మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ఎదుట హాజరుపరిచారు. వీరిలో నలుగురు (గూడె అక్షయ్, పాశం సారంగపాణి, మల్లూరి సోమన్న, మామిడి వంశీ) కు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, వారిని హుజూరాబాద్ సబ్ జైలుకు పంపించారు. మిగతా 13 మందికి రూ. 14,300 జరిమానా విధించారు. అంతేకాకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా, వారికి రూ.2,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కే. సుజాత తెలిపారు.

## తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు హాజరైన జిల్లా వాసి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ 2025లో, హనుమకొండ జిల్లా శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ గుడి తిరుపతి ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఆయన గణిత, వైద్యశాస్త్రాల్లో కంట్రోల్ టెంపరేచర్ లో న్యూమరికల్ ఎనాలసిస్ యొక్క ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. డాక్టర్ తిరుపతి కాకతీయ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఐఐటీ బొంబాయి, అమెరికా, జర్మనీలలో పీడీఎఫ్ (పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్) పూర్తి చేశారు. ప్రస్తుతం భారతదేశంలోనే మొదటి ర్యాంకింగ్ ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరులో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ఆయన 70కి పైగా అంతర్జాతీయ జర్నల్స్‌లో తమ పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ మరియు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ కు ఫెలో గా ఉన్నారు.ఈ సైన్స్ కాంగ్రెస్ కు ఒక జిల్లా వాసి ప్రధాన వక్తగా రావడం స్థానిక ప్రజలకు, యువతకు గర్వకారణం.

## జిల్లా స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక విజయ టాకీస్ రోడ్డులో వీనస్ కన్వెన్షన్, జ్యువెల్లర్స్ వద్ద జిల్లా స్వర్ణకార సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్వర్ణకార పెద్దలు, ప్రముఖులు, సోదరులు హాజరయ్యారు. అధ్యక్షుడు పానుగంటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రుద్రోజు మణింద్రనాథ్ సమక్షంలో కొత్తగట్టు వీరబ్రహ్మాచారి జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తన సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం నాడు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలోని అగ్రంపాడు, లింగమడుగుపల్లి గ్రామాల్లో మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు శీలం సాంబయ్య, దుకిరే నాగేశ్వరరావుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ నాయకులు 'ఇందిరమ్మ ఇళ్లు' పేరుతో గ్రామాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ విషయం ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్లు బొళ్లబోయిన రవియాదవ్, కాంతాల కేశవరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు సావురే రాజేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు బత్తిని వంశీగౌడ్, రెండు గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెంటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల విద్యుదాఘాతంతో మరణించిన మంగళపల్లి పెంటయ్య కుటుంబ సభ్యులను నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి రావాల్సిన లేబర్ కార్డు, విద్యుత్ శాఖ, ఇతర ప్రభుత్వాల నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం, నష్టపరిహారం మొత్తం త్వరగా అందేలా హ్యూమన్ రైట్స్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు గాదె కృష్ణ, ఆర్. శేఖర్, తొర్రూర్ డివిజన్ ప్రెసిడెంట్ పల్లెర్ల రమేష్, సెక్రటరీ నాలో శ్రీనివాస్, సూరి, యాకేందర్, అడ్వకేట్ ధర్మారం శ్రీధర్ పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, చిట్యాల:** చిట్యాల మండల కేంద్రంలోని గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ విషయాన్ని సంఘం అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాల కమిటీకి అధ్యక్షుడిగా వల్లాల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా క్యాతరాజు మల్లేష్, మేడిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, సహాయ కార్యదర్శి ఉయ్యాల రమేష్, కోశాధికారిగా చిలగాని నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా ఓదెల శ్రీహరి, ఈగ కోటేశ్వర్, మహమ్మద్ అక్బర్, మామిడిశెట్టి తిరుపతి, చింతకింది దశరథం, భీమారం ప్రమీల, పట్టెం రాజు, మహమ్మద్ వలి, పోతుగంటి సంతోష్ ఎన్నికయ్యారు.

# అంబేద్కర్ విగ్రహానికి ఐరన్ స్టాండ్ ఏర్పాటు



వరంగల్ వాయిస్, తొర్రూరు: మండలంలోని నాంచారి మడూర్ గ్రామంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పరుపటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయంతో ఐరన్ స్టాండ్ ఏర్పాటు చేయబడింది. గురువారం ఈ స్టాండ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అంబేద్కర్ విగ్రహ కమిటీ విజ్ఞప్తి మేరకు జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. వారిలో తొర్రూర్ మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ నాయకులు ఎలామంచ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతకుల మధుకర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, పెరటి యాదవ రెడ్డి, ఎండీ యూసఫ్, కోలా సంపత్, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లస్వామి, చందు రామ్, ఉబ్బని సింహాద్రి, చిలువేరు సాయి గౌడ్, ఐత రవి, ఉబ్బని మధు, చందు లక్ష్మణ్, బల్లెం యాదగిరి, ఎండీ యకూబ్, గారె విష్ణు, గారె నరేష్, ప్రవీణ్ ఉన్నారు. గ్రామ నాయకుల్లో మాజీ సర్పంచ్ గుంటుక యాదలక్ష్మి యాకయ్య, మాజీ ఎంపీటీసీ కుంభం సుకన్య, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుంటుక కుమారస్వామి, నాయకులు ఉపాకర్ రెడ్డి, ఇమ్మడి రమణ, దానం రమేష్, వివిధ కులాలకు చెందిన పెద్దలు, నాంచారి మడూర్ గ్రామ అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు సంకినేని యాకయ్య, చిటుకు ఎల్లయ్య, గిద్ద గండు సైదులు, అనపర్తి రామచందర్, మంద వెంకన్న, అంబేద్కర్ కమిటీ చైర్మన్ సంకినేని శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు రమేష్, ఉపాధ్యక్షులు గిద్ద నీరటి వెంకన్న, కార్యదర్శి గిద్ద నీరటి జీవన్, గండు వెంకన్న, గిద్దె పిచ్చి యాకయ్య, ఉడత వెంకన్న, నీరటి ప్రసాద్, కోలాట బృందం కూడా పాల్గొన్నారు.



# దర్శకత్వంలోకి నేహాశర్మ

చిరుత సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది నేహా శర్మ. ఈ సినిమా తర్వాత నేహా శర్మ పలు తెలుగు, హిందీ సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయాయి. అయితే నేహా శర్మ సినిమాలతో బ్రేక్ అందుకోలేకపోయినా ఏ మాత్రం నిరాశ చెందకుండా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటూ అందరిలో జోష్ నింపుతోంది. కాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ బ్యూటీ– ఇక డైరెక్టర్‌గా తన లక్‌ను పరీక్షించుకు నేందుకు రెడీ అవుతుంది. బాలీవుడ్ స్టార్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ నిర్మించనున్న పీరియాడిక్ క్రియేచర్ డ్రామాకు నేహాశర్మ దర్శకత్వం వహించనుందన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఓ టీటీ ప్లాట్ ఫాం భాగస్వామ్యంతో 1945 బ్యాక్ డ్రాప్‌లో సాగే కథ నేపథ్యంలో రాబోయే సినిమాను నేహాశర్మ డైరెక్ట్ చేయనుందంటూ బీటౌన్‌లో కథనాలు రౌండప్ చేస్తున్నాయి.మరి అజయ్ దేవ్‌గన్ టీ–ం ఎలాంటి కథను రెడీ చేసిందనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌లో ఉండగా.. గ్లామర్ డాళ్ నేహా శర్మ దర్శకత్వం వహిస్తుందన్న వార్తలతో సినిమాపై క్యూరియాసిటీ– అమాంతం పెరిగిపోతుంది. సిద్ధాంత్ చతుర్వేది, మోహిత్ రైనా లీడ్ రోల్స్‌లో నటించనున్న ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ షురూ కానున్నట్లు– సమాచారం. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఇక హీరోయిన్‌గా సరైన బ్రేక్ అందుకోలేకపోయిన నేహాశర్మ దర్శకురాలిగా మంచి సక్సెస్ అందుకోవాలని అందరూ విష్ చేస్తున్నారు.



## శ్రీవారిని దర్శించుకున్న నాగచైతన్య దంపతులు

తిరుమల శ్రీవారిని సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో అక్కినేని నాగచైతన్య, శోభిత దంపతులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు– చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో నాగచైతన్య దంపతులకు పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. సినీ దర్శకుడు తివిక్రమ్ శ్రీవారిని దర్శించుకున్నారు.

# విశ్వంభర మరోమారు వాయిదా


మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర' సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం ఇప్పటికే చాలా సార్లు వాయిదా పడిరది. వాస్తవానికి 2025 సంక్రాంతికే ఈ సినిమా రిలీజ్ కావల్సి ఉన్నా సమ్మర్‌కి పోస్ట్ పోన్ చేశారు. అయితే ఇప్పటికే మూవీకి సంబంధించి విడుదలైన గ్లింప్స్ కి నెగిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా వి.ఎఫ్.ఎక్స్ గురించి చాలా నెగిటివ్ కామెంట్స్ వినిపించాయి. దీంతో నిర్మాతలు క్వాలిటీ– విషయంలో కాంప్రమైజ్ కాకూడదు అని భావించి మూవీని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. క్వాలిటీ– ఔట్‌పుట్ తోనే సినిమాని జనాల్లోకి వదలాలని భావించారు చిత్ర బృందం. కొద్ది సేపటి క్రితం యూవీ క్రియేషన్ చిన్న వీడియోని విడుదల చేయగా, ఇందులో చిరంజీవి ఆసక్తికర విషయాలు తెలియజేశారు. మూవీ ఆలస్యానికి కారణం మీకు అత్యున్నత ప్రమాణాలతో, బెస్ట్ క్వాలిటీతో మూవీని మన ముందుకు తీసుకురావాలనే చిత్ర బృందం ఇంత సమయం తీసుకుంటుందని చిరంజీవి అన్నారు. ఇది చందమామ కథలాగా సాగిపోయే అద్భుతమై కథ. చిన్న పిల్లలతో పాటు– పెద్దవాళ్లలో ఉండే చిన్న పిల్లలకి ఈ సినిమా బాగా నచ్చుతుంది అని చిరంజీవి అన్నారు. ఇక మూవీని 2026 సమ్మర్‌కి విడుదల చేయనున్నట్లు చిరంజీవి స్వయంగా చెప్పుకొచ్చారు. చిరంజీవికి జోడీగా త్రిష నటించగా, మరో కీలక పాత్రలో ఆషికా రంగనాథ్ కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నప్పటికీ, ఇది పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు– ఇతర భాషలలో కూడా విడుదల కానుంది.

## విశ్వంభర వాయిదాతో అనిల్‌లో ఆనందం

మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న విశ్వంభర సినిమా రిలీజ్ డేట్ వాయిదా పడడంతో అనిల్ రావిపూడికి కలసి వచ్చిందన అంటున్నారు. 2026 సమ్మర్ లో దీన్ని రిలీజ్ చేస్తున్నామన్నారు. వీఎఫ్ ఎక్స్ భారీగా ఉందని.. అందుకే డిలే అవుతుందన్నారు. అనిల్ రావిపూడితో తీస్తున్న మెగా 157 మూవీ తర్వాతనే ఇది రాబోతోంది. మొన్నటి వరకు దానికంటే ముందే వస్తుందనే ప్రచారం ఉండేది. ఇప్పుడు రాకపోవడంతో అనిల్ రావిపూడికి పండగే. ఎందుకంటే తన సినిమా ముందే విడుదలవుతుందని భావిస్తున్నారు. ఆయన సినిమా వచ్చే సంక్రాంతికి ప్లాన్ చేస్తున్నారు.

ఎందుకంటే తన సినిమా కంటే ముందు విశ్వంభర వచ్చి పెద్ద హిట్ అయి ఉంటే ఆ ప్రెషర్ అంతా అనిల్ మీద ఉండేది. విశ్వంభర కంటే అనిల్ సినిమా పెద్ద హిట్ కావాలనే ఒత్తిడి ఉండేది. కచ్చితంగా మెగా 157తో పెద్ద హిట్ ఇవ్వాలని మెగా ఫ్యాన్స్ నుంచి ఒత్తిడి వచ్చేది. ఎలా చూసినా అనిల్ కు ఇబ్బందే. ఇప్పుడు విశ్వంభర తన సినిమా తర్వాత వస్తోంది కాబట్టి ఎలాంటి టెన్షన్ లేకుండా తన సినిమాను రిలీజ్ చేసుకోవచ్చు. అనిల్ సినిమా ఏ మాత్రం హిట్ అయినా అది విశ్వంభరకు కలిసొస్తుంది. విశ్వంభర మార్కెట్ ఇంకా పెరుగుతుంది. కాబట్టి అనిల్ కు ప్రశంసలే తప్ప విమర్శలు రావన్నమాట.





## హోటల్‌కు రమ్మన్నాడు..

మళయాల నటి రిని ఆన్ జార్జ్ సంచలన ఆరోపణలు మలయాళం ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఇటీవలే తీవ్ర కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. హేమ కమిటీ– నివేదిక తర్వాత పలువురు తారలు తమకు ఎదురైన అనుభవాలను ఒక్కొక్కటికగా బయట పెడుతున్నారు. తాజాగా మరో నటి , మాజీ జర్నలిస్ట్ రిని ఆన్ జార్జ్ ఓ యువ రాజకీయ నాయకుడిపై చేసిన ఆరోపణలు తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఓ యువ రాజకీయ నాయకుడు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ రిని ఆన్ జార్జ్ ఆరోపించింది. ఫైవ్‌స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేశాను రమ్మంటూ అభ్యంతరకరమైన సందేశాలు పంపిస్తూ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేసింది. అయితే, ఆ యువ నాయకుడు ఎవరన్నది మాత్రం చెప్పలేదు. పేరు, పార్టీ వంటి వివరాలు చెప్పేందుకు ఆమె నిరాకరించింది.



# ప్రెస్ క్లబ్‌కే నా సీడీఎఫ్ నిధులు

**శాసనమండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాశ్**

**హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వం నుంచి తనకు సీడీఎఫ్ నిధులు విడుదల కాగానే ప్రెస్ క్లబ్ కే నా మొట్టమొదటి కేటాయింపులు చేస్తానని జర్నలిస్టుల హర్షధ్వానాల మధ్య శాసనమండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ప్రకటించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్ విజేతలకు 'బహుమతి ప్రధానం' కార్యక్రమం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన గురువారం ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ బండా ప్రకాశ్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక దృక్పదం ఉన్న ఫోటోలు సమాజాన్ని మేలుకొలుపుతాయన్నారు. జర్నలిస్టులు తనకు, తాను జర్నలిస్టులకు ఒకరికి ఒకరం అండగా నిలుస్తున్నామని వెల్లడించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు.

**విజేతలకు బహుమతులు..**

ఉత్తమ వార్త చిత్రం విభాగంలో 'జీవనవైవిధ్యం' కాప్షన్ ఫొటోకు సాక్షి దినపత్రిక స్టాఫ్ ఫొటో గ్రాఫర్ పెద్దపల్లి వరప్రసాద్ కు ప్రధమ బహుమతి కింద రూ.10 వేల చెక్కు, మెమోంటో, ప్రశంసాపత్రం అందించి దుశ్శాలువతో సత్కరించారు. 'ఆపత్కాలం' కాప్షన్ ఫొటోకు గాను ఎతెమాద్ దినపత్రిక ఫొటోగ్రాఫర్ షర్ఫొద్దిన్ మాషూక్ కు ద్వితీయ బహుమతి కింద రూ. 5 వేల చెక్కు, మెమోంటో, ప్రశంసాపత్రం అందించారు. 'ఆసరాసంబురం' ఫొటోకాప్షన్ ఫొటోకు గాను నమస్తే తెలంగాణ దినపత్రిక ఫొటోగ్రాఫర్, మేరుగు ప్రతాప్ కు తృతీయ బహుమతి కింద రూ. 3 వేల చెక్కు, మమోంటో, ప్రశంసాపత్రం అందించారు. కన్సోలేషన్ బహుమతులు పొందిన సాక్షి ఫొటోగ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్, ఆంధ్రజ్యోతి సంపెట సుధాకర్, పాలకుర్తి మధు, వీరగోని హరీష్, ఈనాడు ఆవుల సంపత్ లకు రూ 2 వేల చెక్కు, మెమోంటో, ప్రశంసాపత్రం అందించి దుశ్సాలువాతో సత్కరించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఫొటోజర్నలిస్టుకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్, జ్ఞాపిక అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు సభ్యులకు ప్రైవేటులో స్థలం అందించే ప్రకటన చేస్తామన్నారు. 35 ఏళ్ల క్లబ్ చరిత్రలో మొట్టమొదటి సారిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించిన చరిత్ర తమ కమిటీకే దక్కుతుందన్నారు. దేశంలో క్లబ్ సభ్యులకు ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించిన ఘనతా కూడా తమదే అన్నారు. ఇప్పుడు ఫొటో గ్రాఫర్ మిత్రులకు 'ఫోటో కాంపిటీషన్' నిర్వహించిన చరిత్ర తమదేనని చెప్పుకొచ్చారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య మాట్లాడుతూ క్లబ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత తమ కమిటీకే దక్కుతుందన్నారు. క్లబ్ నిర్వహణ విషయంలో అత్యంత పారదర్శకంగా ఉంటున్న తమకు  అభివృద్ధి విషయంలో ఒక విజన్ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, ఫొటో, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు సంపెట సుధాకర్, క్లబ్ కోశాధికారి బొల్ల అమర్, క్లబ్ ఉపాధ్యక్షులు గౌకారపు శ్యాం, అల్లం రాజేష్ వర్మ, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, పొడికొట్టి విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు వీరగోని హరీశ్, ఎండీ నయీంపాషా, కందుకూరి సంజీవ్, బలవారి విజయ్ రాజ్, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్, ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, నల్లాల బుచ్చిరెడ్డి, బండారి ప్రమోద్, పెద్ద సంఖ్యలో ఫొటో, వీడియో జర్నలిస్టులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రదీప్ రావు ప్యానల్ ఘనవిజయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ కు నిర్వహించిన ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్యానల్ ఘన విజయం సాధించింది. గురువారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏవీవీ కళాశాలలో ఎన్నికల పర్వం నిర్వహించారు. బ్యాంక్ లో మొత్తం 6,368 మంది ఓటర్లు ఉండగా అందులో 2,442 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి వాల్యా నాయక్ వెల్లడించారు. పోలింగ్ శాతం 39.34 శాతం నమోదైనట్లు ఆయన ప్రకటించారు. ఓటింగ్ పూర్తియిన వెంటనే కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఎన్నికల్లో తన ప్యానల్ విజయం సాధించిన తర్వాత ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ వరంగల్ కో–ఆపరేటివ్ బ్యాంకును తెలంగాణ రాష్ట్ర మొత్తం విస్తరిస్తామంటూ ప్రకటించారు. రూ.400 కోట్లతో వరంగల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతోందన్నారు. ఓ పార్టీ వ్యక్తిని అయినప్పటికీ బ్యాంక్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తన ప్యానల్ ను గెలిపించడం సంతోషదాయకం అన్నారు. కొంతమంది వ్యక్తులు కావాలనే తనపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. అన్ని పార్టీల నాయకులు కలిసి రావడంవల్లే ఈ విజయం అభించిందన్నారు.



# సంపెట సుధాకర్‌కు ఉత్తమ అవార్డు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో  నిర్వహించిన కాంపిటీషన్లలో ఆంధ్రజ్యోతి సీనియర్ ఫొటోగ్రాఫర్ సంపెట సుధాకర్ కు ఉత్తమ ఫొటో బహుమతి అవార్డు లభించింది. ఈ కార్యక్రమాన్ని గురువారం వరంగల్ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ముఖ్య అతిథి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ చేతుల మీదుగా ఈ బహుమతి ప్రధానోత్సవం జరిగింది.



# గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **మడికొండ గురుకులంలో ఆకస్మిక తనిఖీ**

**వరంగల్ వాయిస్, మడికొండ :** గురుకులాల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ శివారులోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ లోని డైనింగ్ హాల్, ప్రాంగణం, స్టోర్ రూమ్, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్ నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కిచెన్ రూమ్ లో కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, తదితర నిత్యావసరాలను కలెక్టర్ తనిఖీ చేసి తాజా కూరగాయలు, నాణ్యమైన పదార్థాలను వినియోగించాలన్నారు. డైనింగ్, వాష్ ఏరియా పరిశుభ్రంగా ఉండాలన్నారు. తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో మాట్లాడారు. ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. దీనిపై పలువురు విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పుస్తకాలు కావాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందజేస్తానంటూ హామీ ఇచ్చారు. విద్యార్థులలో చాలామంది ఇంజినీరింగ్, వైద్య సీట్లను తప్పనిసరిగా సాధించాలన్నారు. అదేవిదంగా ఆర్ట్ రూంలో విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ బాగున్నాయని కలెక్టర్ కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి దాసరి ఉమామహేశ్వరి, కాజీపేట తహసీల్దార్ భావ్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# వెజ్, నాన్ వెజ్ మార్కెట్ స్థల పరిశీలన

- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**
- **కొత్త మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలి**

**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో నూతనంగా వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ గురించి అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం బండారుపల్లిలోని జిల్లా పశు వైద్యశాఖ కార్యాలయ ఆవరణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఒకే మార్కెట్ ఉన్నందున, జిల్లా పశు వైద్య శాఖ కార్యాలయ ఆవరణంలో కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను నిర్మించుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, జిల్లా పశు వైద్య శాఖ అధికారి కొమురయ్య, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com